క్లుప్తంగా

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

టెక్కలి: స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో (ఏపీఎంజేపీ) 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 191 మంది విద్యార్థులను కేటాయించగా 174 మంది హాజరై పరీక్షను రాశారు. పరీక్షను ప్రిన్సిపాల్ దామోదరరావు పర్యవేక్షించారు.

అక్కుపల్లి రోడ్డుకు మోక్షం


రోడ్డు పనులు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని కాశీబుగ్గ– అక్కుపల్లి రోడ్డుకు ప్రస్తుతం మోక్షం లభించింది. వజ్రపుకొత్తూరు మండల కేంద్రం నుంచి అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ వరకు ఉన్న ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రూ.22 కోట్ల వ్యయంతో శరవేగంగా రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. నిధులు మంజూరు చేసేందుకు కృషి చేసిన మంత్రి సీదిరి అప్పలరాజుకు ఉద్దాన ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులు

కంచిలి: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్‌వోపీ చైతన్యకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సోంపేట ఆర్‌ఎస్ రెస్ట్‌హౌస్‌లో రైల్వే కర్మచారి ట్రాక్ మెయిన్ టైనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా 25 మంది రక్తదానం యువకులు చేశారు. కార్యక్రమంలో ఆర్‌కేటీఏ ప్రెసిడెంట్ వి.రవి, ఈస్ట్‌కోస్ట్ జోనల్ ప్రెసిడెంట్ బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి తపస్‌కుమార్ బారిక్, సోంపేట కార్యదర్శి టి.లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ పి.తేజ, కో–ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, వలంటీర్ పి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

టెక్కలి రూరల్: మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన ఉర్జాన చిన్నారావు అనే వ్యక్తి కుమార్తె వివాహానికి గ్రామానికి చెందిన రాంబాబు చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వాహకుడు ఎన్ని షణ్ముఖరావు రూ.30,500 ఆర్థిక సాయం ఆదివారం అందించారు. చిన్నారావుకు నలుగురు ఆడపిల్లలు కావడంతో ఆర్థిక సాయం అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


డాన్స్ వేస్తున్న విద్యార్థులు

కంచిలి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి అన్నారు. స్థానిక బీసీ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జి.రామారావు, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం సీతారాంనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, టీడీపీ నాయకుడు జగదీష్ పట్నాయక్, విశ్రాంత ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆలయ చైర్మన్ బోయిన మాధవి, కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ తదితరులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో చలివేంద్రాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు.

ఇంటింటా జగన్ నినాదం

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును తెలియజేస్తూ, స్టిక్కర్ అతికిస్తున్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయన్ని తెలుసుకుంటున్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మారోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కవిటి: శిలగాంలో ఎంపీపీ పద్మ ఆధ్వర్యంలో...


కవిటి: కొత్తపాలెంలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ తదితరులు


మందస: కుంటికోట పంచాయతీ వాసుదేవపురంలో...


సోంపేట: ఇస్కలపాలేం గ్రామంలో...


కంచిలి: పెద్దకొజ్జిరియా గ్రామంలో...


కంచిలి: జె.నారాయణపురం గ్రామంలో...


ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామంలో...


ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం గ్రామంలో...


కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో...


టెక్కలి: బొరిగిపేట గ్రామంలో...


ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలో...


సోంపేటలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న నాయకులు


మందస: సిద్ధిగాం గ్రామంలో...

కణితికి ఘన నివాళులు


టెక్కలి: కణితి విశ్వనాథం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి తదితరులు

టెక్కలి: మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం భౌతికకాయానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి తదితరులు ఆదివారం నివాళులర్పించారు. కణితి విశ్వనాథం మృతిపై విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరితో పాటు టెక్కలి నియోజకవర్గానికి చెందిన మరి కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.


వజ్రపుకొత్తూరు: గుళ్లలపాడులో కణితి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కణితి మృతి తీరని లోటు

వజ్రపుకొత్తూరు రూరల్: కణితి విశ్వనాథం మృతి జిల్లాకు తీరని లోటు అని అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ వీసీ హనుమంతు లజపతిరాయ్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. అలాగే మండలంలోని గుళ్లలపాడులో గ్రామస్తులు కణితి విశ్వనాథం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పెద్దలు బగాతి శ్రీకాంత్, హరికృష్ణ, కామేశ్వరావు, గణేష్, సోమేశ్వరరావు, దువ్వాడ శంకర్, బమ్మిడి జయరాం, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: ఎండల తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని శ్రీకాకుళం మాస్ మీడియా అధికారి పైడి రమణ, స్థానిక వైద్యురాలు డాక్టర్ ఎస్.సునీత అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకునే జాగ్రత్తలపై ఆదివారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. మజ్జిగ, గ్లూకోజ్ నీళ్లు, కొబ్బరి బొండాలు, నిమ్మకాయ నీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు నీటిలో కలిపి తాగాలన్నారు. ఉదయం పది గంటల తరువాత సాయంత్రం నాలుగు గంటలకు ముందు ఎండలో తిరగ వద్దన్నారు. ఉపాధి హామీ పథకం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పనులు చేసే వేతనదారులు, రైతు కూలీలు ఎండ సమయంలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆరోగ్య సూపర్‌వైజర్లు, పద్మ, బెండి జనార్దనరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండలాలకు చేరిన పరీక్ష పేపర్లు

నరసన్నపేట:

పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రశ్నపత్రాలు మండల కేంద్రాలకు చేరాయి. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయి. ఎఫ్ఏ–2 పరీక్షలు నిర్వహిస్తారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,600 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది ఓఎంఆర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా 1, 2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, మూడు నుంచి ఐదో తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం ఉంటాయి. 6 నుంచి 9 తరగతులకు 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిషు, 26న గణితం, 27న జనరల్ సైన్స్, 28న సోషల్ స్టడీస్, 29న కంపోజిట్ కోర్సులు పేపర్–1 పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈవో శాంతారావు తెలిపారు.


ఎంఈవో కార్యాలయానికి చేరిన ప్రశ్న పత్రాలు

నవధాన్యాల సాగుతో భూమికి మేలు

జి.సిగడాం:

నవధాన్యాల సాగుతో భూమికి మేలు జరుగుతోందని సేంద్రియ ఎరువుల ట్రైనింగ్ మాస్టార్ శివ అన్నారు. మినుములు, పెసలు, ఉలవలు, జొన్న, తోటకూర, కట్టిజనుము, కంది, ఊదలు, రాగుల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రసాయనిక ఎరువులు వినియోగంతో భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. ముషినివలస, సర్వేశ్వరపురం గ్రామాల్లో నవధాన్యాల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డి.ఆర్.వలస సెక్టార్ ట్రైనర్ రమణమ్మ, రాజేష్, రాజేశ్వరమ్మ, సంతోషికుమారి పాల్గొన్నారు.


ముషినివలసలో నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ట్రస్టు సేవలు అభినందనీయం


మరుగుదొడ్లు ప్రారంభిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన చింతామణి ట్రస్టు రూ.2.70 లక్షల విరాళం అందించడం అభినందనీయమని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు ఆ నిధులతో నిర్మించిన నూతన మరుగుదొడ్ల సముదాయాన్ని ట్రస్టు ప్రతినిధులు ఇందిరాదేవి, మణికుమార్‌లు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాహుదా నదిలో ఎర్త్ బండ్ ఏర్పాటు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు బాహుదా నదిలో ఎర్త్ బండ్‌ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి జయంతి


కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: స్థానిక గ్రంథాలయంలో బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, సాహితీవేత్త, జనోద్ధారకుడు, సంఘ సంస్కర్త కందుకూరి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ, రీడర్స్ సురేష్, నారాయణ, వినోద్, రమేష్, శివ, లక్ష్మి, బాబురావులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


గజ ముద్దలను ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆంధ్రా, ఒడిశా గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గజముద్ద నైవేద్యంగా మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు.

మర్యాదపూర్వక భేటీ

కవిటి: స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా విజయం సాధించిన నర్తు రామారావును పలువురు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఎమ్మెల్సీ రామారావును సత్కరించారు. నియోజకవర్గం అభివృద్ధిలో కలిసి పనిచేస్తానని తెలియజేశారు.


ఎమ్మెల్సీ రామారావును సత్కరిస్తున్న డాక్టర్ పూడి కిరణ్‌కుమార్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం


సోంపేట: మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


ఇచ్ఛాపురం: అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఎఫ్‌వో సూర్యారావు

టెక్కలి రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక దళాధికారి ఎస్.మల్లేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టెక్కలిలో ఆదివారం అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలు కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇళ్లలో వినియోగిస్తున్న గ్యాస్ ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్ఎఫ్‌వో ఆర్.సూర్యారావు సూచించారు. పట్టణంలోని స్వేచ్ఛావతి అపార్ట్‌మెంట్‌లో మహిళలకు గ్యాస్ ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు సంభవిస్తే ఎలా అదుపు చేయాలో సూచించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కామరాజు, రాంబాబు, భీమారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్: వంట గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సోంపేట: గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు మహిళలు అప్రమత్తతంగా ఉంటే ప్రమాద నష్టాన్ని తగ్గించుకోవచ్చని అగ్నిమాపక శాఖాధికారి ఎస్.వరహాలు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోంపేట పట్టణంలో గ్యాస్ ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్.మోహనరావు, ఎం.రమేష్‌నాయుడు, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సువర్చలా హనుమాన్ కల్యాణం


సువర్చలా హనుమాన్ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ సీఈవో దంపతులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సత్య సాయి సేవాసమితి బృందావనంలో సనాతన భాగవతం భక్త సమాజం వారిచే సువర్చలా హనుమాన్ కల్యాణ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించారు. పూజల్లో జెడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

లాఫింగ్ క్లబ్‌లో హౌసీ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని పాత శ్రీకాకుళంలో ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆదివారం హౌసీ పోటీలు జరిగాయి. 22 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్, నిక్కు హరిసత్యనారాయణ, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.


హౌసీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం